

RNI No: APTEL/2018/76747

# నవతరం

తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | శుక్రవారం | సంపుటి: 9 | సంచిక: 232 | పేజీలు: 05 | వెల: 5 /- | 21 ఆగస్టు 2026 |

# ‘హైడ్రా’ చేపట్టిన చెరువుల... అభివృద్ధి భేష్

- హైడ్రాకు జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ కితాబు

**హైదరాబాద్, నవతరం:** నగరంలో హైడ్రా చేపట్టిన చెరువుల పునరుద్ధణ, అభివృద్ధి చాలా బాగుందని జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ కితాబిచ్చింది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి చెరువులోకి వరద నీరు చేరేలా ఇన్‌లెట్లు, చెరువు నిండిన తర్వాత కిందకు పోయేలా ఔట్‌లెట్ల అభివృద్ధితో పాటు.. పటిష్టమైన బండ్‌ల నిర్మాణం.. ఇలా చెరువుకు ఉండే సహజలక్షణాలను పరిరక్షిస్తూ సాగుతున్న హైడ్రా చెరువుల అభివృద్ధి దేశానికి నమూనా అని కొనియాడింది. న్యూఢిల్లీకి చెందిన జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ ఛైర్మన్ డా. శైలేష్ కుమార్ శ్రీవాస్తవ నేతృత్వంలోని సభ్యులు నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి ఫాక్స్ సాగర్ సరస్సును బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సరస్సు ప్రధాన కట్ట (మెయిన్ బండ్)ను పరిశీలించి, సరస్సు ప్రస్తుత పరిస్థితి, కట్ట భద్రతకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. ఫాక్స్ సాగర్ సరస్సు FTL పరిధి 482.6 ఎకరాలు కాగా, సరస్సు పరిరక్షణ, పునరుద్ధరణకు సంబంధించి హైడ్రా రూపొందించిన ప్రణాళికను విమోస్ టెక్నోక్రాట్స్ డైరెక్టర్ యూనస్ వివరించారు. సరస్సు సరిహద్దుల పరిరక్షణ, ప్రజా ఆస్తుల రక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ అభివృద్ధి చర్యలపై వారికి తెలిపారు. హైడ్రా ఫేజ్-3లో పెద్ద సరస్సుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఫాక్స్ సాగర్ సరస్సును అభివృద్ధి చేస్తున్నామన్నారు. చెరువు పునరుద్ధరణ, సంరక్షణ, నీటి నిల్వ సామర్థ్యాన్ని కాపాడటం, సరస్సు పరిసరాలను పరిరక్షించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజా ఆస్తుల పరిరక్షణతో పాటు చెరువులు, సరస్సుల పునరుద్ధరణకు హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలను జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ సభ్యులు అభినందించారు. హైదరాబాద్‌లోని సరస్సులను పరిరక్షించేందుకు, భవిష్యత్ తరాలకు వాటిని సురక్షితంగా అందించేందుకు హైడ్రా చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు.






## పరికి చెరువు ఆక్రమణలపై..

# ‘హైడ్రా’ అధికారులు ఉక్కుపాదం మోపాలి




- యదేచ్ఛగా పరికి చెరువు భూముల ఆక్రమణ
- చర్యలు తీసుకోవడంలో విఫలమౌతున్న స్థానిక ఇరిగేషన్ శాఖ
- కేసులు నమోదు చేయడంలో జాప్యం.. కబ్జాదారులకు వరం
- తప్పుడు లేఔట్, రిజిస్ట్రేషన్ లతో బురిడీ కొట్టిస్తున్న కబ్జాదారులు
- అదే రిజిస్ట్రేషన్ పత్రాలను హైడ్రా అధికారులకు చూపుతూ ‘డ్రామాలు’
- సమగ్ర విచారణ చేసి ఆక్రమనదారులపై చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్, నవతరం:** మేడ్చల్ జిల్లా కూకట్పల్లి మండల పరిధిలోని పరికి చెరువు భూములు కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామ శివారులో విస్తరించి ఉన్నాయి. జగద్గిరిగుట్ట భూదేవి హిల్స్, లెనిన్ నగర్, శిరిడీ హిల్స్, ఆల్విన్ కాలనీ, సిక్కుల బస్తీ, మహదేవపురం సరిహద్దులుగా ఉన్న పరికి చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లలో యదేచ్ఛగా మట్టి నింపుతూ ఆక్రమార్కులు తప్పుడు పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్ లు పొంది ప్రభుత్వ భూముల ఆక్రమణ కొనసాగిస్తున్నారు. ఇదే విషయంలో నవతరం తెలుగు దినపత్రిక కొన్ని వార్తా కథనాలు ప్రచురించింది. అందుకు సంబంధించి భూదేవి హిల్స్ నుండి మహదేవపురం వరకు కొందరి ప్రస్తుత ఆక్రమణలు ప్రభుత్వానికి - ప్రజలకు ప్రయత్నం చేస్తుంది. సమాచారం తెలుసుకున్న స్థానిక ‘హైడ్రా’ అధికారులు ఫీల్డ్ విసిట్ చేసి పరిశీలిస్తున్నారు. మహదేవపురం ఫేజ్ - 2 సరిహద్దులోని ఎఫ్టీఎల్ భూములు ఆక్రమించి (మట్టి, చెత్త) తో పూడ్చి ఆక్రమణలు చేసినట్టు వారి విచారణలో తెలిసిపోయింది. అయినా కూడా ‘తన తప్పు తప్పు కాదు.. తన కబ్జా కబ్జా కాదు’ అన్నట్టు కొందరు వ్యక్తులు అన్నీ తెలిసీ ఎంతఘో కొంత డబ్బులు పెట్టి కొనక్కుని.. అమ్మినవారిని తప్పు పట్టకుండా ‘తమదేమీ తప్పు లేదు, తమ దగ్గర రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయి’ అంటూ బుకాయిస్తున్నారు. వీరి ఆక్రమణలు పూర్తిగా పరికి చేరులో ఉన్నాయని తెలిసి కూడా ‘హైడ్రా’ అధికారులను బురిడీ కొట్టించే ప్రయత్నంలో ఉన్నట్టు తెలుస్తుంది. కొందరు వ్యక్తులు ఈ భూముల్లో ఇటుక బట్టీలు పెట్టుకుని దందా (వ్యాపారం) చేసుకుంటుంటే.. మరికొందరు అక్రమంగా రూములు నిర్మించి, అక్రమ షెడ్లు వేసి వేరేవారికి నెలకింత అని కిరాయిలకు ఇస్తున్నారు. స్థానికులు ‘వీటి ఎవరైనా.. వీటి వల్ల ఇబ్బంది కలుగుతుంది కదా’ అని అడిగే ప్రయత్నం చేస్తే.. తెలియక కొనుక్కున్నాం.. ఏదయితేనేం.. గతంలో ఒకసారి రెవెన్యూ అధికారులు వీటిని కూల్చేశారు, ఇప్పుడూ అదే జరుగుతుంది ఇంకా మూడు నాలుగు లక్షలు ఖర్చయినా పెట్టుకుని మళ్ళీ నిర్మించుకుంటాం.. కొన్ని రోజుల్లో ప్రభుత్వం మారుతుంది. అప్పుడు హైడ్రా అనే వ్యవస్థనే ఉండదు. తద్వారా తమకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తుంది సదరు ఆక్రమణదారులు.

తెలంగాణ రాష్ట్రంలో సహజవనరు లైనటువంటి చెరువులు, కుంటల పరిరక్షణకు ‘ప్రజా ప్రభుత్వం’ చాలా ప్రాధాన్యత ఇస్తుంది. చెరువుల సుందరీకరణకు బంగారు తెలంగాణ, ప్రజా ప్రభుత్వంలో కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేశాయి ప్రభుత్వాలు. ఓ వైపు రేవంత్ సర్కార్ ‘హైడ్రా’ లాంటి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసినా కూడా కొందరు కబ్జాదారుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు. రాత్రిళ్ళు, పగలు అని తేడా లేకుండా ప్రభుత్వ భూములు, చెరువులు - కుంటలు ఆక్రమిస్తూ తమ సత్తా చాటుకుంటున్నారు. కేసులు చేస్తారన్న భయం లేదు, జైలుకు వెళ్తామన్న జంకు లేదు. ఓ వైపు కబజాలు చేస్తూ.. మరోవైపు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. కొందరు ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను చూస్తూ.. అన్నీ తెలిసి కూడా తక్కువ ధరకు వస్తున్నాయని అందులో ప్లాట్ లు కొనుకకుంటుంటే.. మరోవైపు ‘తమకేమీ తెలియదు.. రిజిస్ట్రేషన్ పత్రాలున్నాయి’ అని కొనుక్కున్నాం అంటూ సమర్థించుకుంటున్నారు మరికొందరు. గాజులరామారం గ్రామ పరిధిలోని ఆక్రమనలపై.. తప్పుడు రిజిస్ట్రేషన్ గుర్తించి ఇప్పటికే కొన్ని భూములకు ఫెన్సింగ్ వేశారు హైడ్రా అధికారులు.

కేవలం ఫెన్సింగ్ లకే పరిమితం కాకుండా తప్పుడు పత్రాలతో నిర్మించిన భారీ భావన నిర్మాణాలను సైతం నేలమట్టం చేశారు. అప్పటివరకూ తమకేమీ కాదు. తమ చెప్పు చేతుల్లో కొందరు ‘లంచగొండి అధికారులున్నారు’ అని నమ్మిన బడాబాబుల్లో సైతం గుబులు మొదలైంది. తెలిసీ తెలియక కొనుక్కున్నా, తెలిసి కొనుక్కున్నా తప్పు తప్పే కాబట్టి వ్యవస్థలను చాలెంజ్ చేయకుండా తమ తప్పు తెలుసుకుని సంబంధిత అధికారులకు సహకరించి, తమకు తప్పుడు భూములు అమ్మి సొమ్ము చేసుకున్న వారి నుండి తమ డబ్బులు ఎలా రికవరీ చేసుకోవాలో ఆలోచన చేసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతే కానీ నోరుంది కదా అని ప్రశ్నించినవారిపై తప్పుడు కూతలు కూసి, కొన్ని రోజుల్లో ప్రభుత్వం మారుతుంది.. అప్పుడు హైడ్రా లాంటి వ్యవస్థలు ఎలాగూ ఉండవు అంటూ ‘మేకపోతు గాంభీర్యం’ ప్రదర్శిస్తే.. ‘హైడ్రా’ లాంటి పులి పంజాకు బలి కాక తప్పదంటున్నారు నిపుణులు. ‘పరికి చెరువు’ ఆక్రమనలను గుర్తించి.. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని.. సదరు భూములను భవిష్యత్ తరాలకు అందించాలంటున్నారు స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు.



# స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్

- టీడీపీ జిల్లా పార్లమెంటరీ అధికార ప్రతినిధి దువ్వాడ హేమబాబు చౌదరి హర్షం
- సామాజిక న్యాయ సాధన దిశగా ప్రభుత్వ నిర్ణయం
- గ్రామస్థాయి నుంచి బీసీలకు రాజకీయ భాగస్వామ్యం పెరుగుతుంది



**పలాస, నవతరం:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని టీడీపీ జిల్లా పార్లమెంటరీ అధికార ప్రతినిధి దువ్వాడ హేమబాబు చౌదరి స్వాగతించారు. గురువారం పలాసలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ సాధికారత లక్ష్యాలతో ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన ఘనత టీడీపీదేనని పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాష్ట్రంలో బీసీ వర్గాల ఆత్మగౌరవాన్ని పెంచడమే కాకుండా, ప్రజాస్వామ్యంలో వారి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. 34 శాతం రిజర్వేషన్ అమలతో గ్రామపంచాయతీ సర్పంచ్ పదవుల నుంచి వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్, కార్పొరేషన్ డివిజన్ సభ్యుల వరకు అన్ని స్థాయిల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని దువ్వాడ హేమబాబు చౌదరి తెలిపారు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పాలనా వ్యవస్థలో బీసీల భాగస్వామ్యం విస్తృతమవుతుందని, దీనివల్ల స్థానిక సమస్యలైన తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు వంటి అంశాలపై బీసీ నాయకులు ప్రత్యక్షంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం లభిస్తుందని వివరించారు. ప్రజలకు మరింత చేరువగా, జవాబుదారీతనంతో కూడిన పాలన అందుతుందని ఆయన అన్నారు. బీసీలకు కేవలం రాజకీయ రిజర్వేషన్ కల్పించడంతోనే ప్రభుత్వం ఆగలేదని, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సంక్షేమం తదితర రంగాల్లోనూ సమగ్ర కార్యాచరణ అమలు చేస్తోందని దువ్వాడ హేమబాబు చౌదరి పేర్కొన్నారు. బీసీ విద్యార్థుల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెంపు, వసతి గృహాల అభివృద్ధికి నిధులు కేటాయించామని తెలిపారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా బీసీ యువతకు ఆర్థిక సహాయం, సబ్సిడీ రుణాలు, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని వివరించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, శిక్షణ కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. తెలుగుదేశం పార్టీ స్థాపన నుంచి బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యం కల్పిస్తోందని దువ్వాడ హేమబాబు చౌదరి గుర్తు చేశారు. ఎన్టీఆర్ హయాంలోనే బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేసి చరిత్ర సృష్టించామని, ఇప్పుడు మళ్లీ చంద్రబాబు నాయకత్వంలో అదే స్ఫూర్తితో ఈ నిర్ణయం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బీసీల అభివృద్ధి, సంక్షేమం టీడీపీ అజెండాలో ప్రధాన భాగమని, బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో రాష్ట్రంలో సామాజిక సమతుల్యత మరింత బలోపేతం అవుతుందని దువ్వాడ హేమబాబు చౌదరి అన్నారు. బీసీ వర్గాలకు సరైన గుర్తింపు, గౌరవం లభిస్తుందని, యువత రాజకీయాల్లోకి రావడానికి ఇది ప్రోత్సాహకంగా నిలుస్తుందని అన్నారు. ఈ నిర్ణయాన్ని జిల్లాలోని బీసీ సంఘాలు, టీడీపీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు పెద్ద ఎత్తున పోటీ చేసి ప్రజాసేవ చేయాలని దువ్వాడ హేమబాబు చౌదరి పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్ అవకాశాన్ని ఉపయోగించుకుని బీసీలు రాజకీయంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు. పార్టీ శ్రేణులు బీసీ అభ్యర్థులకు అన్ని విధాలుగా సహకారం అందించాలని, గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

# నీటిబుడగ నిలిచేది నిముషం పాటే..?

నేలతో నీడ అన్నది –
నన్ను తాకరాదని
పగటితో రేయి అన్నది –
నను తాక రాదని
నేడు భర్తనే తాకరాదని –
ఒక భార్య అన్నది..!

రవికిరణం తాకనిదే –
నవకమలం విరిసేనా..?
చల్లగాలి తాకనిదే –
నల్లమబ్బు కురిసేనా..?
మధుపం తను తాకనిదే
మందారం మురిసేనా..?
తల్లిదండ్రి ఒకరినొకరు తాకనిదే
నీవు లేవూ... నేను లేనూ...
నీవులేవు...నేనులేను...లోకమేలేదులే
అన్నాడు మనసుకవి ఆత్రేయ..!

సృష్టి పుట తెరిస్తే –
ఆడ-మగ...రెండక్షరాలు,
జీవితమనే కావ్యానికి
అవే రెండు ఆదిపదాలు..!

విత్తనం-నేల కలిస్తేనే
మొలక మురిసేది
వాన-మట్టి కలిస్తేనే
పుడమి పరిమళించేది
ఆడ-మగ కలిస్తేనే
ఒక జీవన జ్యోతి వెలిగేది...!

ధరణిలో పుట్టిన ప్రతిజీవి –
మట్టిలో కలిసేంతవరకు
ఈ సత్యానికి ప్రత్యక్ష సాక్ష్యమే
యుగయుగాల తరతరాల
జీవపరిణామ చరితకు –
చెక్కుచెదరని సంతకమే..!

దానికి విరుద్ధంగా
తర్కం ఎన్ని తాళాలు వేసినా,
తత్వం ఎన్ని తెరలు కప్పినా,
సిద్ధాంతం ఎన్ని గోడలు కట్టినా –
కాలం త్రాచును చేపట్టి
నిజాన్ని-అబద్ధాన్ని తూస్తే
నిలవనిది ఒక నీడలా...
మిగలనిది ఒక మాయలా
మటుమాయమైపోక తప్పదులే..!

ఎంతటి పురాతనమైన భావమైనా –
కనిపించని కట్టుబాటైనా
కాలాలశిలలపై చెక్కిన సత్యం
పరీక్షకు నిలవాలి...లేంటే–
అది నీటిపై మెరిసే చంద్రబింబంలా
ఒక్క అలకే చెదిరిపోతుంది..!

సత్యం సముద్రమైతే –
విరుద్ధమైన వివాదం
నిముషం పాటు నీటిపై తేలే నీటి బుడగే
అది అలలు తాకగానే చెరిగే
ఇసుకపై లిఖించిన అందమైన అక్షరమే
చరిత్రలో సముద్రంలా
శాశ్వతంగా నిలిచేది సత్యం ఒక్కటే



**రచన**
కవిరత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

# ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

**కుత్బుల్లాపూర్, నవతరం:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఆదేశాల మేరకు.. 279 రోడమేస్త్రి నగర్ డివిజన్ శ్రీరామ్ నగర్ లో గురువారం నాడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో 279 రోడమేస్త్రీ నగర్ డివిజన్ అధ్యక్షులు గుమస్తా మధుసూదన్, ఎక్స్ కో ఆప్షన్ సభ్యులు రషీద్ పాల్గొని చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సాయి, డివిజన్ నాయకులు రఘు రెడ్డి, నాయుకులు రజాక్, షబ్బీర్, మొయిన్, ప్రవీణ్, శంకర్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.






# ప్రాధాన్యతా క్రమంలో, ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నాం

- బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

కుత్బుల్లాపూర్, ఆగస్టు 20 (నవతరం): సిఎంసి కొంపల్లి సర్కిల్ పరిధి అపర్ణ పామ్ మెడోస్, అపర్ణ పామ్ గ్రోస్ నందు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో గ్రామపంచాయతీ స్థాయిగా ఉన్న కొంపల్లినిప్రణాళికాబద్ధంగా, ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులను అభివృద్ధి చేసుకుంటూ నేడు కార్పొరేషన్ స్థాయికి అభివృద్ధి పరిచాం. కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి 12 ఏళ్ల కాలంలో నగరంతో పాటు నగర శివారు ప్రాంతాలను ఎంతో అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా అపర్ణ పామ్ మెడోస్, అపర్ణ పామ్ గ్రోస్ నందు ప్రధాన రోడ్డు తో పాటు అంతర్గత సీసీరోడ్ల నిర్మాణం చేపట్టి అపర్ణ పామ్ మెడోస్, పామ్ గ్రోస్ తో పాటుగా కొంపల్లి డివిజన్ ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ విరాట్, టీపీవో వీణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పాక్స్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సువర్ణ, ప్రవీణ్, వినోద్, చింతల దేవేందర్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు సంగీత రెడ్డి, నాయకులు పూజారి లక్ష్మణ్ గౌడ్, వినోద్, ప్రవీణ్, షన్ను, తదితరులు పాల్గొన్నారు.






# అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలపై పర్యటించిన కూన శ్రీనివాస్ గౌడ్

**మేడ్చల్ మల్కాజ్‌గిరి, నవతరం:** గాజులరామారం విలేజ్‌లో ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ రోడ్డు పరిధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికుల విన్నపం మేరకు మేడ్చల్ మల్కాజ్‌గిరి, డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ గురువారం స్థానిక మున్సిపల్, జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చేపట్టాల్సిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సంబంధించి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో అంచనాలు, ఎస్టిమేషన్లు దగ్గరుండి పరిశీలించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన ప్రారంభించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కూన శ్రీనివాస్ గౌడ్ ఆదేశించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారి డీజీఎం రవి, కాంగ్రెస్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, బుచ్చిరెడ్డి, యాము సాగర్, ఈ సురేష్, కే ఋషి, సంజీవరెడ్డి, సత్యనారాయణ, గోవర్ధన్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, శ్రీరాములు, యాదగిరి, దర్శన్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, సుజిత్ రెడ్డి, బుచ్చయ్య గౌడ్, చంద్రశేఖర్, ఆంజనేయులు, ఈ వెంకటేష్, హరి, శ్రీశైలం, ప్రశాంత్, విద్యా సాగర్, లక్ష్మణ్ తో పాటు స్థానిక జలమండలి, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు, కాలనీవాసులు పాల్గొన్నారు.





# ఇదేనా ప్రజాపాలన అంటే..?

- విలేకరుల సమావేశంలో విరుచుకుపడ్డ కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్పల్లి, నవతరం: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి శేషాద్రి నగర్ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పట్ల వ్యవహరిస్తున్న నిరంకుశ పరిపాలనపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విరుచుకుపడ్డారు ..ముఖ్యంగా మూడు సంవత్సరాల నుంచి కాలయాపన తప్ప ఒక్క మంచి పని చేసిన పాపాన పోలేదని. 22 ఏ సెక్షన్ లో ప్రజల ఆస్తులు చేర్చి నానా ఇబ్బందులుకు గురి చేస్తున్నారని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గత జనవరిలో (దాదాపు 8నెలల క్రితం) కైతలాపూర్ లో రిజిస్ట్రేషన్ ఆఫీస్ శంకుస్థాపన కొరకు వచ్చినప్పుడు 22ఏ సెక్షన్ లో ప్రజల ఆస్తులు ఉండడం వల్ల నానా ఇబ్బందులు పడుతున్నారని ఆనాడే చెప్పానని, ఇప్పుడు ఏమీ తెలియనట్టు అధికారులు తప్పుతో ఇదంతా జరిగిందని ఒక మంత్రి క్షమాపణ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలా ప్రజల ఆస్తులు 22A సెక్షన్ లో చేర్చి వారి దగ్గరికి వచ్చి ముడుపులు సమర్పించిన వారికి ఉపశమనం కలిగిస్తున్నారు అన్న ఆరోపణలు ఉన్నాయని. దీనిపై కచ్చితంగా సి.బి.ఐ విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో కోటి ఎకరాలును ఈ 22 ఏ సెక్షన్ లో పెట్టడం వల్ల కచ్చితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇదా ప్రజాపాలన అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదంతా కేవలం డబ్బులు దండుకోవడానికి తప్ప మరి ఏదీ లేదని ఇప్పుడు అధికారులు తప్పంటూ మాట్లాడటం ఎంతవరకు సమంజసము అని అన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని జాగ్రత్తగా ఉండకపోతే భవిష్యత్తులో మీరు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన హితవు పలికారు. ఉదాహరణకు కెపిహెచ్బి లోని వసంత్ నగర్, సర్దార్ పటేల్ నగర్, సి .బి. సి .ఐ .డి, సాయి నగర్, అలాగే ఆల్విన్ కాలనీ తులసి నగర్ ఇవన్నీ కూడా దాదాపు 50 సంవత్సరాల నుంచి పట్టా భూముల్లో ప్రజలు నివసిస్తున్నారని వీటిని కూడా 22ఎలో చేర్చడం ఏ ప్రాతిపదికన చేర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడకపోతే కచ్చితంగా పోరాటం చేస్తామని, దీన్ని వదిలే ప్రసక్తి లేదని ఆయన తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ప్రజలకు సంక్షేమ పథకాలను కూడా పక్కనపెట్టి చివరికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కూడా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, రాష్ట్రానికి చెందిన బిజెపి కేంద్ర మంత్రులు కూడా దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం వచ్చిందన్నారు. ఎన్నో కష్టనష్టాలను గూర్చి ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాణాలు అడ్డుపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని తీస్తే ఆ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేస్తుందని అన్నారు. దీనిపై కచ్చితంగా సిబిఐ విచారణ జరిపించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇంత జరుగుతున్నా మాకు తెలియదు అధికారులు తప్పు అంటూ అనడం ప్రజలపై వీరికున్న చిత్తశుద్ధి మనకు అర్థమవుతుందని, కెసిఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, ఆయన హయాంలో జరిగిన ఫ్లైఓవర్లు ఆసుపత్రుల నిర్మాణాలను ఇప్పుడు ప్రారంభించడం తప్ప ఇంకేమీ లేదని, ఇప్పటికైనా ప్రజలు గ్రహించి వీరికి తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆధారాలతో సహా మేము ఈ ప్రభుత్వం చేసిన ఘన కార్యాలు వివరిస్తామని, రాఘవ కన్స్ట్రక్షన్ పేరుతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముందుకు వెళ్లడం ఆయనకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆయన డబ్బులు సంపాదించుకోవడం తప్ప, ఇంకేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి ప్రజల పక్షాన లేకుంటే బిఆర్ఎస్ పార్టీ తరఫున కచ్చితంగా పోరాటం సాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావు, సీనియర్ నాయకులు తులసీరావ్, తదితరులు పాల్గొన్నారు.




# రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్, నవతరం: నియోజకవర్గ పరిధిలోని గిరినగర్ డివిజన్ ఇందిరాగాంధీ నగర్‌లో మాజీ ప్రధాని, స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజీవ్ దేశానికి చేసిన సేవలను, యువతకు ప్రాధాన్యతనిస్తూ సాంకేతిక రంగంలో తీసుకొచ్చిన మార్పులను స్మరించుకున్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలు, దేశ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులర్పించారు.







# పలాసలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

- **రాజీవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు**
- **దేశానికి రాజీవ్ సేవలు చిరస్మరణీయం - తంగుడు రమణయ్య**



పలాస, ఆగస్టు 20 (నవతరం): భారతరత్న, స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలను పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు తంగుడు రమణయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ముందుగా రాజీవ్ గాంధీ విగ్రహానికి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు తంగుడు రమణయ్య, పీసీసీ డెలిగేట్ తంగుడు వీరారాజు, పార్టీ అభిమాని మహేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజీవ్ గాంధీ అమర్ రహే, జోహార్ రాజీవ్ గాంధీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు తంగుడు రమణయ్య మాట్లాడుతూ.. భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన దార్శనికుడు, సంస్కరణల పితామహుడు రాజీవ్ అని కొనియాడారు. కేవలం 40 ఏళ్ల వయసులోనే దేశ ప్రధాని బాధ్యతలు చేపట్టి, అత్యంత పిన్న వయస్కుడైన ప్రధానిగా చరిత్ర సృష్టించారని తెలిపారు. దేశంలో సమాచార సాంకేతిక విప్లవానికి, కంప్యూటర్ యుగానికి బీజం వేసింది రాజీవ్ గాంధీ గారేనన్నారు. తంగుడు వీరారాజు మాట్లాడుతూ.. దేశ సమగ్రత, ఐక్యత కోసం, శాంతి కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. గ్రామ స్వరాజ్యం కోసం పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి, అధికార వికేంద్రీకరణకు కృషి చేశారని, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యంలో వారి భాగస్వామ్యాన్ని పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. రాజీవ్ గాంధీ ఆశయాలను, ఆయన చూపిన మార్గాన్ని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ దేశంలో బలంగా పుంజుకుంటోందని, రాజీవ్ గాంధీ కలలు కన్న భారతాన్ని నిర్మించడానికి అందరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు తంగుడు రమణయ్, పీసీసీ డెలిగేట్ తంగుడు వీరారాజు, పార్టీ అభిమాని మహేష్ పాల్గొన్నారు.

# జగన్‌తో సీదిరి భేటీ.. అండగా ఉంటానన్న మాజీ సీఎం

- జైలు కష్టాన్ని జగన్‌తో పంచుకున్న సీదిరి.. ధైర్యం చెప్పిన జగన్
- అక్రమ కేసులకు బెదరను.. జగన్ భరోసాతో సీదిరి సవాల్
- చంద్రబాబు కక్ష రాజకీయాలకు నిదర్శనం.. సీదిరి 23 రోజుల జైలు జీవితం



పలాస, ఆగస్టు 20 (నవతరం): పలాస నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజ వైఎస్సార్సీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. అక్రమ కేసులతో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తనను 23 రోజుల పాటు జైల్లో నిర్బంధించిందని, ఇటీవలే బెయిల్ పై విడుదలై బయటకు వచ్చానని సీదిరి అప్పలరాజు ఈ సందర్భంగా జగన్ కు తెలిపారు. జైలులో తాను ఎదుర్కొన్న ఇబ్బందులు, తన కుటుంబ సభ్యులు ఎదుర్కొన్న మానసిక వేదనను జగన్ తో పంచుకున్నారు. ఈ సందర్భంగా సీదిరి అప్పలరాజుకు, ఆయన కుటుంబ సభ్యులకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధైర్యం చెప్పారు. రాజకీయంగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా, ఎన్ని కుట్రలు ఎదురైనా అధైర్యపడవద్దని, ధైర్యంగా నిలబడాలని సూచించారు. వైఎస్సార్సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తోందని జగన్ పేర్కొన్నారు. సీదిరి అప్పలరాజ కు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయపరంగా, రాజకీయంగా పూర్తి మద్దతు ఇస్తామని భరోసా ఇచ్చారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేకనే పలాస నియోజకవర్గంలో ప్రత్యర్థులు కుట్రపూరితంగా అక్రమ కేసులు పెట్టించారని సీదిరి అప్పలరాజు జగన్ దృష్టికి తీసుకెళ్లారు. పలాస నియోజకవర్గంలో తనకు ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేకనే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అక్రమ కేసులకు, జైలు నిర్బంధానికి, బెదిరింపులకు భయపడేది లేదని, వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో, పలాస నియోజకవర్గ ప్రజల అండదండలతో ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తానని సీదిరి అప్పలరాజు స్పష్టం చేశారు. అనంతరం సీదిరి అప్పలరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీ సుమారు గంట పాటు కొనసాగింది.




తెలంగాణలోని శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగులాంబ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ప్రపంచ స్థాయి అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణ పనులు జరుపుకున్న ఈ రైల్వే స్టేషన్ ప్రసిద్ధ శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి - జోగులాంబ దేవి అమ్మవారిని దర్శించుకునే భక్తులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాన్ని అందించనుంది. **- నవతరం, అలంపూర్**

# సుజలాం ఆర్.ఓ. ప్లాంట్‌లో వసూళ్ల ఆరోపణలు

- రూ.2–4 వసూలు చేయాల్సిన చోట రూ.10 వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు
- ఫోన్‌పే చెల్లింపుల ఆధారాలు ఉన్నాయంటున్న స్థానికులు.. ఉచిత నీటి సరఫరా నిబంధనలు అమలవుతున్నాయా?

**అశ్వారావుపేట, నవతరం:** అశ్వారావుపేట పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం సమీపంలో ఉన్న సుజలాం ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ నిర్వహణపై పలు ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. పంచాయతీ హయాంలో నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా 20 లీటర్ల నీటి క్యాన్‌కు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి ఫోన్‌పే ద్వారా జరిగిన చెల్లింపుల ఆధారాలు తమ వద్ద ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

### రూ.2 నుంచి రూ.4 వరకు.. వసూలు మాత్రం రూ.10?

సుజలాం ప్లాంట్ ద్వారా 20 లీటర్ల నీటి క్యాన్‌కు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.2, బీసీ, ఓసీ వర్గాలకు రూ.4 వరకు మాత్రమే వసూలు చేయాలని పంచాయతీ స్థాయిలో నిర్ణయించినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం 20 లీటర్ల క్యాన్‌కు రూ.10 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిర్ణయించిన ధరలకు, క్షేత్రస్థాయిలో వసూలు చేస్తున్న మొత్తానికి భారీ వ్యత్యాసం ఉండటంపై అధికారులు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### 16 ఏళ్ల లెక్కలు తేల్చాలంటున్న ప్రజలు

ఈ ప్లాంట్ నిర్వహణకు సంబంధించిన వ్యవహారం సుమారు 16 ఏళ్లుగా కొనసాగుతున్న నేపథ్యంలో ఇంతకాలం వసూలైన మొత్తాలపై పూర్తి స్థాయి లెక్కలు పరిశీలించాలనే డిమాండ్ వినిపిస్తోంది. ప్రభుత్వ భూమి, ప్రభుత్వ నీటి వనరులు, ప్రజా ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన ప్లాంట్ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తాలు వసూలు చేసి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రభుత్వ కార్యాలయాలకు ఉచిత నీరు ఎక్కడ?

ప్లాంట్‌కు సంబంధించిన ఒప్పంద నిబంధనల్లో బస్టాండ్, పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం తదితర ప్రజా వినియోగ ప్రాంతాలకు ఉచితంగా తాగునీరు అందించాల్సిన అంశం ఉన్నట్లు సమాచారం. ప్రజా సమావేశాలు, అధికారిక కార్యక్రమాల సమయంలోనూ అవసరమైన నీటి క్యాన్లు ఉచితంగా అందించాల్సి ఉంటుందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఆయా ప్రాంతాలకు ఉచిత నీటి సరఫరా జరుగుతోందా? లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా బస్టాండ్‌లో ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

### ధరల పట్టిక ఎక్కడ?

ప్లాంట్ వద్ద ప్రజలకు స్పష్టంగా కనిపించేలా నీటి ధరల పట్టిక ఏర్పాటు చేశారా? నిర్ణయించిన ధరలే వసూలు చేస్తున్నారా? ఫోన్‌పే ద్వారా జరుగుతున్న చెల్లింపులకు సరైన రశీదులు ఇస్తున్నారా? అనే అంశాలపై అధికారులు తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది. ఫోన్‌పే చెల్లింపుల ఆధారాలు ఉన్న నేపథ్యంలో వాటిని పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

### పంచాయతీ నుంచి మున్సిపాలిటీకి.. పర్యవేక్షణ ఎవరిది?

అశ్వారావుపేట గ్రామ పంచాయతీ మున్సిపాలిటీగా మారిన తర్వాత సుజలాం ప్లాంట్ పర్యవేక్షణ బాధ్యత ఎవరికి అన్న అంశంపైనా స్పష్టత అవసరమని ప్రజలు అంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సంప్రదించగా మున్సిపాలిటీగా మారినందున ప్రస్తుతం ఈ వ్యవహారం తమ పరిధిలో లేదని, మున్సిపల్ అధికారులు పరిశీలించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం.



## సుజలాం వాటర్ ప్లాంట్‌లో... అసలేం జరుగుతోంది?

- లీజ ముగిసినా కొనసాగుతున్న నిర్వహణపై ప్రశ్నలు.. ధరల పట్టిక ఏది?
- ప్రశ్నించిన విలేకరి ఫోన్ లాక్కునే ప్రయత్నం జరిగిందంటూ ఫిర్యాదు
- సమాచార హక్కు చట్టం ద్వారా చర్యలు లేవని అధికారుల సమాచారం
- కోర్టు వ్యవహారం కొనసాగుతుండగా.. అధికారుల వైఖరిపై అనుమానాలు

ఖమ్మం – భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవతరం: అశ్వారావుపేట పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం సమీపంలో ఉన్న సుజలాం ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు తక్కువ ధరకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ నిర్వహణపై ఇప్పటికే పలు ప్రశ్నలు తలెత్తుతుండగా.. తాజాగా ప్లాంట్ వద్ద ధరల పట్టిక ఎందుకు లేదని తెలుసుకునేందుకు వెళ్లిన విలేకరితో నిర్వాహకుడి మధ్య జరిగిన పరిణామాలు కలకలం రేపుతున్నాయి.

ధరల పట్టిక కోసం వెళ్లిన విలేకరి

ప్లాంట్ వద్ద అధికారిక ధరల పట్టిక కనిపించకపోవడంతో.. దాని వివరాలను తెలుసుకునేందుకు విలేకరి అక్కడికి వెళ్లి వీడియో చిత్రీకరణ చేపట్టారు. ఆ సమయంలో ప్లాంట్ నిర్వాహకుడు వినుకొండ శ్రీనివాసరావు అక్కడ లేకపోవడంతో ఆయన భార్యను విలేకరి ధరల పట్టిక గురించి ప్రశ్నించినట్లు తెలిపారు. దానికి ఆమె.. "ఓనర్ గారు లేరు.. ఆయన వచ్చిన తర్వాత అడగండి.. బయటకు వెళ్లారు" అని సమాధానం ఇచ్చినట్లు విలేకరి వెల్లడించారు. అనంతరం అక్కడి నుంచి వస్తుండగా నిర్వాహకుడు ఎదురై.. ఎవరు మీరు? ఎందుకు వీడియోలు తీస్తున్నారు? మీకు సంబంధం ఏమిటి? అంటూ ప్రశ్నించినట్లు తెలిపారు.

**ఫోన్ లాక్కునే ప్రయత్నం జరిగిందంటూ ఆరోపణ.**

ప్లాంట్ ప్రజలకు సంబంధించిన సేవ అని, ధరచేసి తుది పరిష్కారం వచ్చేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన సుజలాం ప్లాంట్.. ప్రజలకే అందుబాటులో ఉండాలి. ప్రజా ఆస్తి విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా అధికారులు పూర్తి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టిక ఎందుకు లేదో తెలుసుకునేందుకే వీడియో తీస్తున్నానని విలేకరి సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఈ క్రమంలో నిర్వాహకుడు తన చేతిలోని ఫోన్‌ను లాక్కునే ప్రయత్నం చేశారని విలేకరి ఆరోపించారు. ఈ పరిణామంపై ఇప్పటికే అత్యవసర పోలీసు నంబరు వందకు సమాచారం అందించడంతో పాటు.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విలేకరి తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

**పశువైద్యశాల సిబ్బంది వీడియోలు ఎందుకు తీశారు?**

ఇదే సమయంలో మరో అంశం చర్చకు దారితీసింది. ప్లాంట్ నుంచి బయటకు వచ్చిన అనంతరం పక్కనే ఉన్న పశువైద్యశాలకు చెందిన వైద్యుడు, కాంపౌండర్ తనను, తన వీడియోలను చిత్రీకరించినట్లు విలేకరి తెలిపారు. సుజలాం ప్లాంట్ వ్యవహారంతో పశువైద్యశాల సిబ్బందికి ప్రత్యక్ష సంబంధం ఏమిటి? వారు విలేకరి వీడియోలను ఎందుకు చిత్రీకరించాల్సి వచ్చింది? ఎవరైనా సూచించడంతో చిత్రీకరించారా? లేక అక్కడ జరిగిన పరిణామాలను సాధారణంగా రికార్డు చేశారా? అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ అంశంపైనా సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**పది సంవత్సరాల ఒప్పందం ముగిసినా నిర్వహణ ఎలా?**

సుజలాం ప్లాంట్‌కు సంబంధించి 2010లో ఎం/ఎస్ ఏటీఎమ్ వాటర్ సిస్టమ్స్‌కు చెందిన వినుకొండ శ్రీనివాసరావుకు పది సంవత్సరాల బూట్ ఒప్పందం కింద ప్లాంట్ అప్పగించినట్లు సమాచారం. ఆ ఒప్పంద కాలం 2020 జూన్‌తో ముగిసినట్లు సంబంధిత వివరాలు సూచిస్తున్నాయి.

అయితే ఒప్పంద కాలం ముగిసిన తర్వాత కూడా ప్లాంట్ నిర్వహణ కొనసాగుతున్నట్లయితే.. దానికి ప్రస్తుతం చట్టబద్ధమైన ఆధారం ఏమిటన్నది అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

**2018 పొడిగింపు లేఖపై అనుమానాలు**

2018లో అప్పటి పంచాయతీ కార్యదర్శి ద్వారా పది సంవత్సరాల పొడిగింపునకు సంబంధించిన లేఖ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఆ లేఖకు గ్రామపంచాయతీ పాలకవర్గ తీర్మానం ఉందా? జిల్లా స్థాయి అధికారుల అనుమతులు ఉన్నాయా? అన్నది కీలక ప్రశ్నగా మారింది. అధికారిక అనుమతులు లేకుండా పొడిగింపు లేఖ ఇచ్చి ఉంటే.. దాని చట్టబద్ధత ఏమిటన్నదీ తేలాల్సి ఉంది. ఈ వ్యవహారంపై అప్పట్లో సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ, విచారణ జరిగిందా? అన్న ప్రశ్నలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి.

**హైకోర్టు వ్యవహారం.. తాత్కాలిక ఉత్తర్వులపై ప్రశ్నలు**

ఈ పొడిగింపు లేఖను ఆధారంగా చేసుకుని ప్లాంట్ నిర్వాహకుడు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి తాత్కాలిక ఉత్తర్వులు పొందినట్లు సమాచారం. కేసు ప్రస్తుతం కొనసాగుతున్నట్లు అధికారుల నుంచి సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన పత్రాల్లో పేర్కొన్నట్లు విలేకరి తెలిపారు. అయితే తాత్కాలిక ఉత్తర్వు తుది తీర్పు కాదన్న విషయం నేపథ్యంలో.. కేసులో ప్రభుత్వ విభాగాల తరఫున ఇప్పటివరకు ఏ న్యాయపరమైన చర్యలు తీసుకున్నారు? కౌంటర్ దాఖలు చేశారా? కేసును త్వరగా తుది పరిష్కారానికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టారా? అన్నది అధికారులు వెల్లడించాల్సి ఉంది.

**సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చిన అంశాలు**

సుజలాం ప్లాంట్ వ్యవహారంపై విలేకరి ఇప్పటికే అశ్వారావుపేట మున్సిపల్ కమిషనర్‌కు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినట్లు తెలిపారు. దానికి సంబంధించి అధికారులు కోర్టు ఉత్తర్వుల ప్రతిని అందించడంతో పాటు.. కేసు కొనసాగుతున్నట్లు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు. అంతేకాకుండా.. ప్లాంట్‌పై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అధికారుల నుంచి వచ్చిన సమాచారంలో స్పష్టమైనట్లు విలేకరి తెలిపారు. ఇదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కేసు కోర్టులో కొనసాగుతున్నా.. ప్లాంట్‌పై చర్యలు తీసుకోకుండా ఉండటానికి న్యాయపరమైన కారణం ఏమిటి? ప్రభుత్వ ఆస్తి వినియోగంపై సంబంధిత శాఖలు ఇప్పటివరకు ఏ చర్యలు చేపట్టాయి? మున్సిపాలిటీగా మారిన తర్వాత ప్లాంట్‌పై మున్సిపల్ యంత్రాంగం వైఖరి ఏమిటి? అన్నది ప్రజలకు తెలియాల్సి ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి మున్సిపాలిటీకి బాధ్యత మారిందా? ఈ అంశంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సంప్రదించగా.. అశ్వారావుపేట గ్రామపంచాయతీ మున్సిపాలిటీగా మారిన నేపథ్యంలో ప్లాంట్ ప్రస్తుతం తమ పరిధిలో లేదని, మున్సిపల్ కమిషనర్ పరిధిలోని అంశమని సంబంధిత అధికారి తెలిపినట్లు సమాచారం. మరి ప్లాంట్ మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చినట్లయితే.. దాని ఆస్తి, నిర్వహణ, ఒప్పందాలు, ప్రస్తుత హక్కులు, బాధ్యతలపై మున్సిపాలిటీ అధికారికంగా ఏ నిర్ణయం తీసుకుంది? అన్నది ప్రశ్న.

**ధరల పట్టిక లేకుండా నీటి విక్రయాలు?**

ప్రజలకు అందించే నీటి ధరలు స్పష్టంగా

20 Aug 2026 | Page 4
Source: https://epaper.navatharam.com

### కోర్టు వ్యవహారంపైనా స్పష్టత అవసరం

సుజలాం ప్లాంట్ నిర్వహణకు సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని, తాత్కాలిక స్టే ఉన్నట్లు సమాచారం. అయితే ప్రజల నుంచి వస్తున్న అక్రమ వసూళ్ల ఆరోపణలు, నిబంధనల ఉల్లంఘనలపై మున్సిపల్ అధికారులు న్యాయస్థానంలో తమ వాదనలు సమర్థంగా వినిపించారా? సంబంధిత వివరాలను కోర్టుకు సమర్పించారా? అనే అంశాలపై కూడా స్పష్టత రావాల్సి ఉంది.

### అధికారుల విచారణకు ప్రజల డిమాండ్

సుజలాం ప్లాంట్‌కు సంబంధించిన ఒప్పందం, పంచాయతీ తీర్మానాలు, నీటి ధరలు, గత 16 ఏళ్ల ఆదాయ-వ్యయ లెక్కలు, ఉచిత నీటి సరఫరా నిబంధనలు, ప్రస్తుత నిర్వహణ హక్కులు, కోర్టు కేసు వివరాలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. అధిక ధరల వసూళ్లు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలకు నిర్ణయించిన ధరలకే శుద్ధజలం అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ స్పందించి సమగ్ర విచారణకు ఆదేశిస్తారా? లేక ఆరోపణలు ఆరోపణలుగానే మిగిలిపోతాయా? అన్నది వేచి చూడాల్సి ఉంది.








## రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ..
## పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణలోని రెవెన్యూ శాఖలో నిషేధిత భూముల (22ఏ) పేరుతో బహిరంగంగా దందాలు, వేధింపులు సాగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సంచలన బహిరంగ లేఖ రాశారు. ఈ అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.

చట్టప్రకారం నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లను అడ్డుకోవాల్సిన 22ఏ నిబంధనను, ప్రైవేట్ ఆస్తులపై కావాలనే కృత్రిమ వివాదాలు సృష్టించి డబ్బులు గుంజడానికి వాడుకుంటున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ నుంచి ప్రారంభించి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ (HMDA) అనుమతులు ఉన్న వేలాది ప్లాట్లు, నివాసాలను ఏకపక్షంగా నిషేధిత జాబితాలో చేర్చి సామాన్యులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితమే క్రమబద్ధీకరించిన అర్బన్ ల్యాండ్ సీలింగ్ (ULC) భూములను, క్లియర్ రిజిస్టర్డ్ పత్రాలు ఉన్న ఆస్తులను మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చడం తీవ్ర దుర్మార్గమని విమర్శించారు.

రెవెన్యూ శాఖలో ఏకంగా 30 శాతం కమిషన్ల రాకెట్ నడుస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. ఒకసారి 22ఏ జాబితాలో పెట్టిన భూములను మళ్లీ తొలగించాలంటే మార్కెట్ విలువలో 30 శాతం కమిషన్లు ఇవ్వాలని దళారులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు.





ప్రత్యేకించి ఓఆర్ఆర్ పరిసరాల్లో ఉన్న అత్యంత విలువైన భూములను బ్లాక్ చేసి, రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లకు ఒప్పుకోవాలని యజమానులపై ఒత్తిడి తెస్తున్నారని ధ్వజమెత్తారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను ఈ జాబితాలో పెట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా బయటపెట్టినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 22ఏ జాబితాలో కొత్తగా చేర్చిన, అలాగే తొలగించిన ప్రతి భూమి వివరాలపై హైకోర్టు మాజీ న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ, ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని కోరారు. జిల్లాల వారీగా ఈ నిషేధిత భూముల జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి పారదర్శకత నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఒక అవినీతి మంత్రిని కాపాడేందుకు ప్రజల నమ్మకాన్ని పణంగా పెడుతున్నారని, రాహుల్ గాంధీ వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## 'మార్గదర్శి'కి సుప్రీంలో భారీ ఊరట..
### ఉండవల్లి పిటిషన్ కొట్టివేత

న్యూ ఢిల్లీ, నవతరం: ఈనాడు గ్రూప్ నకు చెందిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో ఆ సంస్థకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ కేసులో ప్రజా ప్రయోజనం ఏమీ కనిపించడం లేదని, ఇది వ్యక్తిగత వివాదంలా ఉందని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.



## రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న

# నర్సారెడ్డి భూపతిరెడ్డి

**కుత్బుల్లాపూర్, నవతరం:** గిరినగర్ డివిజన్ లోని ఐడిపిఎల్ చౌరస్తా వద్ద జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు బుయ్యని శివకుమార్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణ మరియు జయంతి కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హనుమంత్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేతలు కేక్ కట్ చేసి, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్ గౌరీష్, పాలకృష్ణ, జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చంద్రయ్య, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ బొట్ల విజయ్ కుమార్, గిరినగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కనకరావు, రంగారెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జలీల్ ఖాన్, పేట్ బషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్, గణేష్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇరుగు రాధాకృష్ణ, దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కుల మల్లేష్, బహదూర్ పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శులు గణేష్, జాకీర్, సీనియర్ నాయకులు జేమ్స్, మేకల ఎల్లయ్య, పాషా మరియు అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






## రాజకీయాల్లో సంస్కారం ముఖ్యం..

# అహంకారం కాదు

- **కింజరాపు అచ్చెన్నాయుడూ**
- **మీ అహంకారానికి 2029లో ప్రజల తీర్పే సమాధానం**
- **దువ్వాడ శ్రీధర్ బాబా, న్యాయవాది | పలాస**



పలాస, నవతరం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీనియర్ ప్రజానాయకుడిగా, దశాబ్దాల ప్రజాజీవితంలో తనదైన ముద్ర వేసుకున్న ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ బొత్స సత్యనారాయణ ను వ్యక్తిగతంగా అవమానించడం చాలా బాధాకరమని, న్యాయవాది దువ్వాడ శ్రీధర్ బాబా అన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అతిపెద్ద కాపు సామాజిక వర్గానికి చెందిన బొత్స సత్యనారాయణ ఒక్క సామాజిక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, అన్ని కులాలు - అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న ప్రజానాయకుడని పేర్కొన్నారు. బొత్స సత్యనారాయణ పై అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారని, 2029లో ప్రజల తీర్పు ఏమిటో స్పష్టంగా తెలుస్తుందని దువ్వాడ శ్రీధర్ బాబా అన్నారు. అహంకారం, అధికారంతో ప్రజల మనసులను గెలవలేరని, మీ రాజకీయ పతనానికి ప్రజల తీర్పే సమాధానం చెబుతుందని అన్నారు. రాజకీయంగా విభేదించడం తప్పు కాదని, విధానాలను విమర్శించవచ్చని, ప్రజా సమస్యలపై ప్రశ్నించవచ్చని ఆయన అన్నారు. అయితే వ్యక్తిగత దూషణలకు దిగజారడం ప్రజాస్వామ్య సంస్కారం కాదని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ దశాబ్దాలుగా ప్రజాజీవితంలో ఉన్న బొత్స సత్యనారాయణ వంటి సీనియర్ నాయకుడిని అవమానించే ముందు రాజకీయ నాయకులు తమ మాటలను ఒకసారి ఆలోచించుకోవాలని సూచించారు. “పదవులు శాశ్వతం కావు, అధికారం శాశ్వతం కాదు, కానీ మన మాటలు, మన సంస్కారం ప్రజల జ్ఞాపకాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. రాజకీయాల్లో అహంకారానికి కాదు, సంస్కారానికి విలువ ఉంటుంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు” అని దువ్వాడ శ్రీధర్ బాబా అన్నారు.

## కొండా సురేఖ మాజీ ఓఎస్డీపై హత్యాయత్నం కేసు

హైదరాబాద్, నవతరం: తెలంగాణ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) సుమంత్‌పై తీవ్ర అభియోగాలతో కేసు నమోదైంది. ఓ వ్యాపారిని బెదిరించి రూ. 10 కోట్లు డిమాండ్ చేశారని, ఆ నగదు ఇచ్చేందుకు నిరాకరించడంతో దాడికి పాల్పడ్డారన్న ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో సుమంత్‌తో పాటు మరో ఐదుగురిని నిందితులుగా చేర్చారు.

సుమంత్ నుంచి తనకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ ఓ వ్యాపారి పోలీసులను ఆశ్రయించారు. తనను రూ. 10 కోట్లు డిమాండ్ చేశారని, ఆ మొత్తం చెల్లించడానికి నిరాకరించడంతో తనపై




భౌతిక దాడికి పాల్పడ్డారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా తొలుత మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. అనంతరం, ఘటన జరిగిన ప్రాంతం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రావడంతో ఈ కేసును అక్కడికి బదిలీ చేశారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ పోలీసులు సుమంత్‌తో పాటు మరో ఐదుగురిపై హత్యాయత్నం సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే

# మాధవరం కృష్ణారావు

కూకట్పల్లి, నవతరం: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా రాబోయే వినాయక చవితి, బతుకమ్మ పండుగ నేపథ్యంలో రంగదాముని చెరువు బోయిన్పల్లి చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లు, సుందరీకరణ పనులు చేపట్టాలని ఇబ్బంది ఉంటే నన్ను సంప్రదించాలని ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అక్కడ అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే, పెండింగ్లో ఉన్న రోడ్లు ,వాటర్ పైప్ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అలాగే నూతన రోడ్లు, పైప్ లైన్ కొరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే నియోజకవర్గంలో దాదాపు గత పది ఏళ్ల కాలంలో 80% పనులు పూర్తి చేసుకున్నామని.. కానీ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ కారణంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు అందించే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. రోడ్లు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారిని.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు సంవత్సరాల కాలంలో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది అని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పనులు పూర్తి చేసే విధంగా చూడాలని.. నూతన పనులుకు కూడా త్వరలోనే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.




## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

నాంపల్లి, నవతరం: తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిరాకరించింది.




రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'డేంజర్ బెల్స్' మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం... పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది.

అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేక పోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాధనాన్ని ఈ విధంగా వాడటానికి బదులు భూబాధితులకు సకాలంలో పరిహారం ఇచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అసలు ఇటువంటి పథకాల అవసరమే ప్రజలకు ఉండదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించి, ఆ ఆదాయంతో సంక్షేమం చేపట్టవచ్చని సూచిస్తూ, సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన వెనుక దేశవ్యతిరేక శక్తులు

హైదరాబాద్, నవతరం: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనల లక్ష్యంగా నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ పెట్టుబడుల సేకరణ పేరుతో రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న విదేశీ పర్యటనలన్నీ భారత్‌పై విద్వేషం చిమ్మే వర్గాలతోనే సాగుతోందని ఆయన ఆరోపించారు. జార్జ్ సోరోస్ వంటి భారత్ వ్యతిరేక భావజాలం కలిగిన వ్యక్తులు, సంస్థల నిధులతో నడిచే వేదికల వద్దకే సీఎం వెళుతున్నారని విమర్శించారు. దేశవ్యతిరేక ఐడియాలజీ ఉన్న సంస్థలను కలవడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు.

అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను హెచ్చరిస్తూ... గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రాజకీయ నాయకుల మాటలు విని పలువురు అధికారులు చివరకు జైలుపాలు కావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి వల్ల అధికారులకు ఎటువంటి రక్షణ ఉండదని, భవిష్యత్తులో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వచ్చే 2029 అసెంబ్లీ



ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ భారీ మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com,
Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://epaper.navatharam.com